



చర్చా వేదికలో మాట్లాడుతున్న అధ్యాపకులు అక్తర్ భాను , హాజరయిన ఆయా సంఘాల నేతలు

ప్రాజెక్టులకు పడని అడుగులు

- వెంటాడుతున్న సమస్యలు - 26 నుంచి సిపిఎం మహా పాదయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడడం లేదు. కరువు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి జిల్లాలో ఆదోని నుంచి కర్నూలు వరకు మహాపాదయాత్ర చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలోని పలు సమస్యలపై ప్రజాశక్తి కథనం...

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు జరిగేలా రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకు మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరద వస్తేనే కాలువకు సాగునీరు అందుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలి ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊళ్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హొళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబయికి తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకు ఏ బడ్జెట్‌లోనూ ప్రస్తావించలేదు.

పోరు యాత్ర ద్వారా గళమెత్తుదాం

- మహిళలపై హింసను అరికట్టాలి - మద్యం, మత్తుపదార్థాలను నివారించాలి
- మహిళ చర్చా వేదికలో మేధావుల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళలపై హింస సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా పోరు యాత్రలో అందరు కలిసి రావాలని ఆయా సంఘాల నాయకులు, మేధావులు కోరారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సిక్యాంపు లలిత కళా సమితి మినీహాల్లో మహిళలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు. ముందుగా మణిపూర్ ఘటనలో, ఇతర ఘటనల్లో మృతి చెందిన వీరమహిళలకు నివాళులర్పించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అలివేలు అధ్యక్షత వహించారు. సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకులు అక్తర్ భాను ప్రారంభించి మాట్లాడారు. సమస్యల మూలాలను సంపూర్ణంగా తొలగించేలా కార్యాచరణ ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వాడిన మనుషులు వాటికి బానిసై పశుతత్వాన్ని సంతరించుకుని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కవి రచయిత కళ్యాణదుర్గం స్వర్ణలత మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించకుండా అది కనిపించకుండా చేస్తే చాలు, నిర్లక్ష్యానికి గోడ కట్టి, పరదా ఇవతల పగలబడి నవ్వుతూ ఏమీ జరగలేదంటూ, సమస్య లేదంటూ కబుర్లు చెప్పే ఈ పాలకుల విధానాలను ఎండగట్టాలన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి.నిర్మల, ప్రముఖ సర్జన్ డాక్టర్ మాధవి శ్యామల మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో టివి, సినిమా, పేపర్, వాట్సాప్, ఇతర సోషల్ యాప్‌లలో స్త్రీల ప్రాధాన్యతను తగ్గిస్తూ చూపుతున్నారన్నారు. మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై హింస చెలరేగుతున్నా నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సమత నాయకురాలు సుజాత మాట్లాడుతూ... దాడులు, హింసపై మాట్లాడడమే కాదు దాని కారకుల స్థితిపై కూడా సమూలంగా చర్చించాలన్నారు. దేశంలో అమాయకులు, అభాగ్యులపై దాడులు పెరిగాయన్నారు. మొదట తినే తిండి, దుస్తులు, తర్వాత హిజాబ్ పేరుపై, కులం, మతం, ప్రాంతం ఉపయోగించుకుని దాడులు జరుగుతున్నాయని తెలిపారు. తెలుగు అధ్యాపకులు వెంకటలక్ష్మి మాట్లాడుతూ... మహిళలు పుట్టినప్పటి నుంచి అనేక రకాల హింసను ఎదుర్కొంటున్నారన్నారు. మణిపూర్ మహిళలను మదమెక్కిన అల్లరి మూకల గుంపు పెట్టిన హింసపై కవితను చదివి వినిపించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపీ బసవరాజు ఆలపించిన పాటలు ఆలోచింపజేశాయి. కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, అబ్దుల్లా, డివైఎఫ్ఐ మహిళా రాష్ట్ర నాయకులు శిరీష పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింస, ఏరులై పారుతున్న మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలని మహిళా సంఘాలు, అభ్యుదయవాదులు, మేధావులు, విద్యావంతులు, ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా పోరు యాత్రలో భాగస్వామ్యం కావాలన్నారు. ఐద్వా న్యూ సిటీ కార్యదర్శి అరుణమ్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు కెఎస్.పద్మ, పిఎస్.సుజాత, బాలలక్ష్మి, అమీనా, వేణి, లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, యోగి పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించాలని గ్రామ పంచాయతీ రాజ్ చాంబర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపి పంచాయతీ రాజ్ ఛాంబర్ అసోసియేషన్ , జిల్లా గ్రామపంచాయతీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బిర్రు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా మా గ్రామాల ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలైన రోడ్లు , డ్రెయినేజి , శానిటేషన్, లైటింగ్, తాగునీరు సమకూర్చలేక ఉత్సవవిగ్రహాలుగా మిగిలిపోయామన్నారు. గ్రామాల అభివృద్ధికి పంపిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8660 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కాజేసిందన్నారు. గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను కొత్తగా ప్రవేశపెట్టి సర్పంచులకు ఎలాంటి పని లేకుండా చేసిందని అన్నారు. సర్పంచులకు ఉన్న విధులను, గ్రామాలకు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి భూమా వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి వై రామచంద్రుడు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సర్పంచులు

స్టాండింగ్ కమిటీకి పది మంది నామినేషన్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం పది మందినామినేషన్ పత్రాలను కర్నూలు నగరపాలక సంస్థ అదన కమిషనర్ పివి. రామలింగేశ్వర్ కు సోమవారం సమర్పించారు. నామినేషన్లు వేసిన వారిలో అన్నే పోగు క్రాంతి కుమార్ 12వ వార్డు, చెన్నబోయిన సాంబశివరావు 39వ వార్డు, సంఘాల సుదర్శన్ రెడ్డి 29వ వార్డు, ఆత్మకూరు నాగలక్ష్మి రెడ్డి 20 వార్డు, శ్రీనివాసరావు నగరూరు 45వ వార్డు, కె.పద్మలత 17వ వార్డు, సుజాత జిఎల్‌వి ఐదో వార్డు, పి.శేషావలి ఒకటవ వార్డు, షేక్ యూనుస్‌బాష పదవ వార్డు, సోంపల్లి కృష్ణకాంత్ 48వ వార్డులకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను 25న మంగళవారం స్క్రూటిని ఉంటుందని అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ తెలిపారు.

వివరాలు ఇవ్వకపోతే ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థుల డేటా సర్వేలో భాగంగా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు వివరాలు ఇవ్వకపోతే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన డిఇఒ రంగారెడ్డిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి వాలంటీర్లు తప్పుడు డేటా నమోదు చేయకుండా సరైన డేటా నమోదు చేయాలని ఆదేశించారు. ఒకవేళ డేటా తప్పుగా నమోదు చేస్తే సంబంధిత వాలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డేటా నమోదు చేయకపోతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిస్టమ్ డ్రాపౌట్స్, స్కూల్ డ్రాపౌట్స్‌కు సంబంధించిన సంఖ్యలో కూడా ఆదోని, ఎమ్మిగనూరు మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. బుధవారం నాటికి వారిని పూర్తిగా పాఠశాలలో చేర్పించి పురోగతి తీసుకురావాలని సూచించారు. లేకపోతే సంబంధిత ఎంఇఒలపై చర్యలు తప్పవన్నారు. 'జగనన్న సురక్ష'కు సంబంధించి సర్వీస్ రిక్వెస్ట్‌లను జనరేట్ చేయడంలో జిల్లాలో క్రిష్ణగిరి మండలం అత్యంత తక్కువ జనరేట్ చేశారని తెలిపారు. వాటిలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హౌస్ హోల్డ్ సర్వే చేయడంలో వెల్దుర్తి, కర్నూలు అర్బన్, గోనెగండ్ల మండలాల్లో తక్కువ పురోగతి సాధించారని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కన్సిస్టెంట్ రిథమ్‌లో భాగంగా వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంబంధిత పాఠశాలలను, హాస్టల్‌ను, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేసే విధంగా ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలన్నారు జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... సిసిఆర్‌సి కార్డులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మండలాలను త్వరగా పూర్తి చేయడంతో పాటు శుక్రవారం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

మండల స్థాయిలో పరిష్కరించడం లేదు

స్పందన అర్జీలను మండల స్థాయిలో అధికారులు పరిష్కరించకపోవడంతో జిల్లాస్థాయికి ఎక్కువగా వస్తున్నాయని కలెక్టర్ సృజన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి సమస్యల పరిష్కారం మండల స్థాయిలోనే జరగాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెసి నారపురెడ్డి మౌర్యలు బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... 'జగనన్నకు చెబుదాం', స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని, బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి వెళ్లకుండా చూడాలని తెలిపారు. 'జగనన్న సురక్ష' ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా టోకెన్స్ రైజ్ చేసి సర్వీసు రిక్వెస్టులను నివృత్తి చేయాలన్నారు. సమస్యలను నాణ్యతతో మండల స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

గ్రామాల ఎంపికకు త్వరలో కేంద్ర బృందాలు

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023లో భాగంగా గ్రామాల ఎంపికకు త్వరలో కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించనున్నాయని కలెక్టర్ డాక్టర్ సృజన పేర్కొన్నారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023' గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని పంచాయతీల్లోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వచ్చే బృందాలు ముఖ్యంగా గ్రామాల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లను, మురుగు కాలువలను, చెత్త సేకరణలో సేకరించిన ఘన, ద్రవ వ్యర్థ పదార్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు, ఏం చేస్తున్నారు తదితర అంశాలపై పరిశీలించి గ్రామాలకు గ్రేడ్స్ కేటాయించి గ్రామాల ఎంపిక చేస్తారని తెలిపారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ - గ్రామీణ్ కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రజల భాగస్వామ్యం పెంపొందించడంపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెసి నారపురెడ్డి మౌర్య, జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, డిఆర్‌ఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఢిల్లీలో కిరణ్‌బేడి అవార్డు అందుకుంటున్న కళాశాల ఛైర్మన్ జివిఎం మోహన్

రవీంద్రకు బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డుకు ఎంపికైంది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్ బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డును పూర్వ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలకు బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాల అవార్డుకు ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఓటర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గూడూరు : ఇంటింటి ఓటర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సోమవారం గూడూరు తహశీల్దార్‌కుశివశంకర్ నాయక్‌కు స్పందన కార్యక్రమంలో కర్నూల్ పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, గూడూరు పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు నాగరాజు వినత పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్వహించే ఇంటింటి ఓటర్ సర్వేను బిఎల్‌ఒలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఒకే కుటుంబంలో ఉన్న సభ్యులను ఒకే ఇంటి నెంబర్ పై ఒక పోలింగ్ బూత్ లో వచ్చేటట్లు బిఎల్‌ఒలు ఓటర్లకు వివరించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఇవ్వాలని పట్టణంలో వలసలు వెళ్లిన వారి వివరాలను సేకరించి వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బివి కిషోర్‌వర్మ తదితర కోట్ల టీం సభ్యులు పాల్గొన్నారు

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అల్లర్లలో మహిళలను అవమానించి హింసించిన మృగాలను కచ్చితంగా శిక్షించాలని కర్నూలు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా ఈ ఘటన ఉందన్నారు. ఎస్‌టి మహిళల పట్ల దుర్మార్గం వ్యవహరిస్తూ పట్టపగలు నగ్నంగా వారిని ఊరేగించడం ప్రజాస్వామ్యవ్యవస్థ కే కలంకమన్నారు. స్థానిక పాలకులు నోరు మెదపకపోవడం తూతూ మంత్రపు చర్యలు చేపట్టడం సిగ్గుచేటని అన్నారు. స్థానిక ప్రభుత్వం బలపరిచే పాలకులు బేసరత్తుగా తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- లీగల్ కర్నూలు

మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను నిరసిస్తూ సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదురుగా ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) , ఐఎఎల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులను నిరసన తెలిపారు మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న హింసకాండను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా , మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మణిపూర్‌లో హింసకాండ పట్ల ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అక్కడ మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను ప్రపంచానికి తెలియకుండా ఇంటర్నెట్ కార్యక్రమాలను నిలిపివేసిందన్నారు. మహిళల పైన జరుగుతున్న దాడులకు మానభంగాలు హత్యలు అత్యాచారాలు వ్యతిరేకంగా అలాగే కొవ్వొత్తుల ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐలు కేంద్ర కమిటీ సభ్యులు కెంగారకుమార్, ఐలు జిల్లా నాయకులు డి.వెంకటస్వామి, టౌన్ అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్,ఎస్.లక్ష్మన్న, ఐలు మహిళా నాయకురాలు జాస్మిన్, అరుణ, ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగనాథ్, జిల్లా నాయకుడు రవికాంత్ ప్రసాద్, దస్తగిరి సీనియర్ న్యాయవాదులు బి. మురళీమోహన్, బి. చంద్రుడు, బలరాము, రాము, రాకేష్, జూనియర్ న్యాయవాదులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మణిపూర్ ఘటనకు నిరసగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

స్టాండింగ్ కమిటీకి పదిమంది నామినేషన్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం పదిమంది తమ నామినేషన్ పత్రాలను కర్నూలు నగరపాలక సంస్థ అదన కమిషనర్ పివి. రామలింగేశ్వర్ కు సోమవారం సమర్పించారు. నామినేషన్లు వేసిన వారిలో అన్నే పోగు క్రాంతి కుమార్ 12వ వార్డు, చెన్నబోయిన సాంబశివరావు 39వ వార్డు, సంఘాల సుదర్శన్ రెడ్డి 29వ వార్డు, ఆత్మకూరు నాగలక్ష్మి రెడ్డి 20 వార్డు, శ్రీనివాసరావు నగరూరు 45వ వార్డు, కె.పద్మలత 17వ వార్డు, సుజాత జిఎల్‌వి ఐదో వార్డు, పి.శేషావలి ఒకటవ వార్డు, షేక్ యూనుస్‌బాష పదవ వార్డు, సోంపల్లి కృష్ణకాంత్ 48వ వార్డులకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను 25న స్క్రూటిని ఉంటుందని అధికరారులు తెలిపారు.



స్టాండింగ్ కమిటీకి నామినేషన్ వేస్తున్న సంఘాల సుదర్శన్‌రెడ్డి

రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్‌కు నిరసన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో సుందరయ్య నగర్, ఇందిరమ్మ కాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర రోడ్డుపై వున్న ట్రాన్స్ ఫార్మర్ ను వెంటనే షిఫ్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు, సిపిఎం మండల కార్యదర్శి పిబి.ఉషనయ్య . మండల నాయకులు జి.ఆంజ నేయులు డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరిం చాలని సోమవారం ట్రాన్స్ ఫార్మర్ దగ్గర నిరసన తెలిపారు. విద్యుత్ డిఇ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కె.వెంకటరాముడు, పిబి. ఉషనయ్య, జి.ఆంజ నేయులు, డి. శ్రీరాములు, జి.గోపాల్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు మాట్లా డుతూ గ్రామంలో గతంలో ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య నగర్ ఏర్పాట య్యాయని అన్నారు. ఆర్టీసీ బస్సు రోజు కర్నూలు నుండి దేవమాడ గ్రామాలకు బస్సు నడుస్తోందన్నారు. గొందిపర్ల గ్రామం దగ్గర బస్సు దిగి ఆ కాలనీలకు పోవాలంటే రెండు కిలోమీటర్ల దూరం నడుస్తూ వెళ్లాలన్నారు. ఆ కాలనీల మీద దేమాడకు బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను అడిగితే జడ్‌పి హెచ్‌ఎస్ స్కూల్ దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డంగా ఉందని, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రక్కకు షిఫ్ట్ చేసి రోడ్డుకు మరమ్మతులు చేస్తే బస్సు నడుపుతామని తెలిపారన్నారు. విద్యుత్ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్ చేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విద్యుత్ డిఇ స్పందిస్తూ వెంటనే ఎఇతో మాట్లాడి రెండు,మూడు రోజుల లోపల ఎస్టిమెన్షన్ వేయించి పంపిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు




వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 102 ఫిర్యాదులు అందాయన్నారు. డిఎస్‌పి శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జె.మోహన్, రైతులు

పందుల బారి నుండి పంటలను కాపాడాలి

స్పందనలో సిపిఎం వినతి

ప్రజాశక్తి-సి బెళగల్

పందుల బారి నుండి పంటలను, మండలంలోని అన్యాక్రాంతమైన కొండలు, పచ్చిక బయలు భూములను కాపాడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.మోహన్ అధికారులను కోరారు. మారందొడ్డి రైతులు సాగుచేసిన సుమారు 120 ఎకరాలలో ఆయా పంటలను పందులు నాశనం చేశాయని, బాధితులు సుమారు 40 మందిఉన్నారని తెలిపారు. బెళగల్ లోని గొర్రెల మేకల సంఘం నాయకులు పాండు, ఎర్రమల,తదితరులు పచ్చిక బయలు భూములను బడా బాబులే పదుల ఎకరాలలో ఆక్రమించి అక్రమ సాగులు చేసారన్నారు. దీంతో మూగ జీవాలకు మేత కొరత తీవ్రత ఏర్పడుతుందని అన్నారు. పలుమార్లు విన్నవించినా స్పందన చూపడం లేదని రైతులు, సిపిఎం నాయకులు మోహన్‌ను ఆశ్రయించగా ఎంపిడిఒ రాముడు, తహసీల్దార్ శేషఫణిలకు వినతిపత్రం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు చేపట్టే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు కోరారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, కరువు నివారణ జరగాలంటే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. హంద్రీనీవా ద్వారా 106 చెరువులకు నీళ్లు నింపాలని, జిల్లా యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు స్థాపించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర ప్రారంభోత్సవానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. ఆదోని ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. గతంలో పరిశ్రమలు ఉండడం వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి పొందేవారని తెలిపారు. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులను రాబట్టడంలో స్థానిక పాలకులు విఫలం చెందారని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కావాలంటే సమైక్య పోరాటాలు అవసరమన్నారు. పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు రామాంజనేయులు, వీరేష్, శ్రీనివాసులు, మునిస్వామి, తిక్కన్న ఉన్నారు. ఆస్పరిలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా, పరిశ్రమలు, ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించ లేదని మండిపడ్డారు. జిల్లాలోని తుంగభద్ర నది నుంచి దిగువకు వందలాది టిఎంసిల నీరు వృథాగా పోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. సిపిఎం నాయకులు బాలకృష్ణ, రామాంజనేయులు, రంగస్వామి, మధు రెడ్డి పాల్గొన్నారు.

అసమర్ధపాలనను తరిమికొడదాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ


మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అసమర్ధ పాలన సాగిస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ కోరారు. సోమవారం దేవనకొండలోని శ్రీకృష్ణరంగా కళ్యాణ మండపంలో ఆలూరు నియోజకవర్గస్థాయి రియల్ టైమ్ స్ట్రాటజీ క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌ఛార్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. టిడిపి ఆలూరు నియోజకవర్గ పరిశీలకులు ఆదినారాయణ, ఆర్‌ఎస్ ట్రైనర్లు ఉరుకుందు, వెంకన్న, రామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గద్దెరాళ్ల, పల్లెదొడ్డి గ్రామాల్లో విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో 'బిడిసితోనే భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు.

26న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- యుఇఇయు డివిజనల్ కార్యదర్శి మల్లికార్జున

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 26న విజయవాడలో జరిగే ఎపిఎస్‌పిడిసిఎల్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి మల్లికార్జున కోరారు. సోమవారం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలని, విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. విద్యుత్ కార్మికులకు ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌గా మార్చాలని తదితర సమస్యలపై ఈ సదస్సులో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. కార్మికులు దాదా పీరా, గాది లింగప్ప, ఎఎల్ఎం విజయ మోహన్ రెడ్డి, యుడిసి ఈశ్వరయ్య, జెఎల్ఎంజి-2 గదాల లింగప్ప, మల్లికార్జున, కాంట్రాక్ట్ కార్మికులు వెంకటేశ్వర్లు, రఫిక్ పాల్గొన్నారు.



రైతు సంక్షేమాభివృద్ధికి కృషి

- గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'
-రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - దేవనకొండ

రైతు సంక్షేమ, అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. సోమవారం మండలంలోని జిల్లేడుబుడకల, మాదాపురం, ఓబులాపురం గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి గుమ్మనూరు జయరామ్ హాజరయి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండడానికి సచివాలయంలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతు సంక్షేమానికి ప్రతేడాది పంటల బీమా, రైతు భరోసా కింద పరిహారం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లేడుబుడకల ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని, సిసి రోడ్డు, డ్రెయినేజీ కాలువలు నిర్మించాలని, మాదాపురం గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు మంత్రికి విన్నవించారు. అందుకు స్పందించిన మంత్రి సచివాలయానికి మంజూరయ్యే నిధులతో వాటిని పూర్తి చేయిస్తామన్నారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ భూపాలుడు బందోబస్తు నిర్వహించారు. సొంత గ్రామంలో ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు 'గడపగడపకు' హాజరు కాకపోవడం గమనార్హం. గుమ్మనూరు సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుమాంబ, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి మండల నాయకులు మోహన్ రెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, దివాకర్ నాయుడు, ఎల్‌కె.శీను, రామచంద్ర, కొత్తపేట బాబు, దస్తగిరి, కౌలుట్ల పాల్గొన్నారు.


ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరామ్


బెల్ట్ షాపుల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- మొహర్రం ఉత్సవాల్లో మద్యం తాగి అల్లర్లు సృష్టిస్తే చర్యలు, కేసు నమోదు : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని, గతంలో నిర్వహించిన బెల్ట్ షాపుల నిర్వాహకులను ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో గతంలో నిర్వహించిన బెల్ట్ షాపుల నిర్వాహకులను పిలిపించి అవగాహన కల్పిస్తూనే వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహించినట్లు తమ దృష్టికి వచ్చినా లేదా గోప్యంగా ఎవరైనా సమాచారం ఇచ్చినా ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని తెలిపారు. స్టేషన్‌కు తీసుకొచ్చి తగిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు : మొహర్రం ఉత్సవాల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ప్రజలకు కూడా అవగాహన కల్పించి ఉత్సవాల్లో ఎవరైనా తాగి అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొహర్రం ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పట్టుబడిన కర్ణాటక మద్యం

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. మండలంలోని హెబ్బటం గ్రామం ఈరప్పకు చెందిన దొడ్డిలో 23 బాక్సుల ఒరిజినల్ ఛాయిస్, డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ ప్యాకెట్లు, 2 బాక్సుల 8పిఎం విస్కీ, 180 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, ఒక బాక్స్ పిన్ బీర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి, అక్రమ మద్యాన్ని నిల్వ ఉంచి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు కృషి

- టిడిపి వాల్మీకి సాధికారిత సభ్యులు పూల నాగరాజు


కరపత్రాలను విడుదల చేస్తున్న భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు టిడిపి కృషి చేస్తుందని టిడిపి రాష్ట్ర వాల్మీకి సాధికారత కమిటీ సభ్యులు పూల నాగరాజు తెలిపారు. సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు ఆదేశాల మేరకు బోయ సాధికారత కమిటీ జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయుడు అధ్యక్షతన మండలంలోని బినిగేరి గ్రామంలో టిడిపి వాల్మీకి పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ శాసనసభ సమావేశంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కేవలం నాలుగు జిల్లాల్లో ఉండే వాల్మీకులను మాత్రమే చేర్చాలని తీర్మానం చేయడం దారుణమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వాల్మీకులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం 'మీరే మాకు గౌరవం' కరపత్రాలను విడుదల చేశారు. తిమ్మన్న, శేషాద్రి నాయుడు, నారాయణ, జిల్లా నాయకులు రాజకుమార్, తిక్కయ్య, నాగరాజు, తిక్కా రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై భగ్గుమన్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అమానుష ఘటనపై ప్రజా సంఘాల నాయకులు భగ్గుమన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ మాదిగ, డిబిఎస్ జిల్లా అధ్యక్షులు టి.లోకేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్, నవ్యాంధ్ర తాలూకా అధ్యక్షులు సన్నేక్కి కరెన్న, ఆర్‌ఎవిఎఫ్ డివిజన్ అధ్యక్షులు మోహన్, వైహెచ్‌పిఎస్ నాయకులు వీరేశ్ మాట్లాడారు. మణిపూర్‌లో సుమారు 80 రోజుల నుంచి కుకీ తెగలపై ఉన్నత వర్గాలైన మెయితీ కులం వారు దాడి చేస్తూ ఉంటే బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అగ్రకులాలైన మెయితీలకు వత్తాసు పలుకుతూ మానభంగాలు చేయిస్తూ, హత్యలు చేయిస్తూ మారణకాండలకు పాల్పడుతూ దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ తాలూకా ఇన్‌ఛార్జీ దేవపుత్ర, పెద్దకడబూరు మండల అధ్యక్షులు పెద్ద తాయన్న, చిలకలడోన గ్రామ నాయకులు మహానంది, మామిడి రాజు, మనోహర్, కిరణ్ కుమార్, మంత్రాలయం నాయకులు పేతురు, శివ, రవి, ఆంధ్రయ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

బస్సు సకాలంలో రాక అవస్థలు

- గంతలమయమైన రోడ్డుపై ప్రాణభయంతో ఆటోలో విద్యార్థుల ప్రయాణం

ప్రజాశక్తి - పెద్దకడబూరు/మంత్రాలయం



ఆర్‌టిసి బస్సులు సకాలంలో రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిన్న కడబూరు గ్రామానికి బస్సు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతునేందుకు బస్సు లేకపోవడం వల్ల ఆటోలో ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కేవలం ఒకే ఆటోలో సుమారు 30 మంది విద్యార్థులు బరువైన పుస్తకాలతో ఆటోలో పరిమితికి మించి ఒకరిపై ఒకరు ఇరుక్కోవడమే కాక ఆటోకు ఇరువైపులా వేలాడుతూ పెద్దకడబూరుకు వస్తుండగా ప్రజాశక్తి క్లిక్‌మనిపించింది. అసలే వర్షాకాలం, రోడ్డంతా గుంతలమయంగా మారడంతో విద్యార్థులు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని భయభయంగా ప్రయాణిస్తున్నారు. ఒకవైపు చదువుకోవాలనే కోరిక, మరోవైపు భారమైన ప్రయాణం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గుంతలు పడిన రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో ఆటో డ్రైవర్లకు గుంతలు కనిపించక భయంగా డ్రైవింగ్ చేస్తున్నారు. చిన్నకడుబూరుకు ఆర్‌టిసి డిపో మేనేజర్ బస్సును సకాలంలో నడపాలని, రోడ్డు దుస్థితిపై ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు.

బిఎల్‌ఒలు ఎవరో తెలియకపోతే ఎలా..? : మాధవరావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం

నందవరం మేజర్ పంచాయతీలో ఎన్నికల బిఎల్‌ఒ ఎవరో రాజకీయ పార్టీ నాయకులకు తెలియకపోతే ఎలా అని టిడిపి తాలూకా క్లస్టర్ ఇన్‌ఛార్జీ మాధవరావు దేశాయి ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ ఓట్లను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాలను రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రతి రాజకీయ పార్టీని వెరిఫికేషన్ సందర్భంలో భాగస్వామ్యులు చేయాలని ఆదేశిస్తే, నందవరం మండలంలో మాత్రం ఏయే వార్డుకు ఎవరో బిఎల్‌ఒలో తెలుపలేదన్నారు. బిఎల్‌ఒలు ఎవరో తెలిస్తే తాము వారి వెంట వెళ్లి నకిలీ ఓటర్లను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు స్పంచించి బిఎల్‌ఒ సమాచారాన్ని అందించాలని కోరారు. లేకపోతే తహశీల్దార్, ఆర్ఐ, విఆర్‌ఒపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

'అర్జీలకు సత్వరమే పరిష్కారం'

ఆదోని : స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందనలో డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పూర్తయ్యే సమస్యలు డివిజన్ స్థాయి వరకు రాకుండా చూసుకోవాలన్నారు. గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, వ్యవసాయ శాఖ ఎడి గిరీష్ కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియా, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సిపిఎం జిల్లా నాయకులు గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలకుల అధికారులపై ఉందని సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సిఐటియు నాయకులు రాముడు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి, ఎమ్మిగనూరు సమగ్రాభివృద్ధిని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 31 వరకు చేపట్టే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. సోమవారం పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, ముబారక్ నగర్, సున్నంబట్టి ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను సిపిఎం పాదయాత్ర బృందానికి వివరించారు. రోడ్లు సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి లేకపోవడం వల్ల పై మాలగేరి ప్రైమరీ స్కూల్‌కు ధోబీఘాట్ వైపు నుంచి వచ్చే విద్యార్థులు మురికి నీళ్లలో నడుచుకుంటూ వస్తున్నారని చెప్పారు. ధోబిఘాట్ వద్ద వంతెన నిర్మించాలని కోరారు. ముబారక్ నగర్‌లో మట్టి రోడ్లు గుంతలమయమై ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తాయమ్మ కాలనీ, ముబారక్ నగర్‌లో డ్రెయినేజీ సౌకర్యం లేదని చెప్పారు. సిపిఎం జిల్లా నాయకులు గోవిందు మాట్లాడుతూ... పట్టణంలో రోజురోజుకు సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. 34 ఏళ్లుగా ఉన్న సిసి రోడ్లు నేడు శిథిలావస్థలో ఉన్నాయని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి బడుగు, బలహీన వర్గాల వారు ఉండే ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసయ్య, రాజు, చంద్ర, రాముడు, దాదా, సుభాన్ పాల్గొన్నారు.


పాదయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

'కస్తూరిబా' విద్యార్థినులకు ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి - మంత్రాలయం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి ఆర్థికంగా ప్రోత్సాహం అందజేశారు. సోమవారం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో ఉన్న కస్తూరి బా గాంధీ పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా తనవంతు సహకారం కింద రూ.5 వేలు అందజేస్తామని గతంలో జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా మరుసటి రోజు అత్యధిక మార్కులు ద్వారా ఉత్తీర్ణత సాధించిన కె.మేఘన (487)కు రూ.3 వేలు, ప్రమీల రాణి (482) రూ.2 వేల నగదును వైసిపి మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, సచివాలయ కో కన్వీనర్ వికెసి రాఘవేంద్రాచారి అభినందించారు. ఇంటర్‌లోనూ మంచి మార్కులతో రాణించాలంటూ వారి చేతులమీదుగా అందజేసి శాలువాతో విద్యార్థినులను సన్మానించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వెంకటరెడ్డి, కరస్పాండెంట్ శాంతి పాల్గొన్నారు.

రూ.లక్ష విలువ గల మద్యం స్వాధీనం: ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎక్సైజ్ శాఖ అధికారుల వాహనాల తనిఖీలో భాగంగా రూ.లక్ష విలువ గల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయరాముడు తెలిపారు. సోమవారం పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. సిల్వర్ కలర్ ఎపి 11 ఎఇ 3868 నెంబర్ గల స్కార్పియో వాహనం తమకు దూరంగా నిలిపి డ్రైవర్ పారిపోయాడని తెలిపారు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా అందులో 20 బాక్సుల ఒరిజినల్ ఛాయిస్, 1920 బాక్సుల 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను గుర్తించినట్లు చెప్పారు. వాహనంలో పాటు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ సోమశేఖర్ రావు, హెడ్ కానిస్టేబుళ్లు గోపాల్, లింగ ప్రసాద్, గౌస్ రబ్బాని, పోలీసులు రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాదమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దీక్ష

ప్రజాశక్తి-ఆలూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు పాత బస్టాండ్ ఆవరణలో 8 గంటల దీక్ష చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా, గోవర్ధన్‌లు ఎస్ఎఫ్ఐ నాయకులకు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సంయుక్త, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 47 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గతంలో ఉచితంగా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు అందించేదని తెలిపారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు ఇవ్వడానికి నిరాకరిస్తుందంటే పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమేనని విమర్శించారు. 3 వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. పుస్తకాలు, అధ్యాపకులు లేకపోవడంతోనే గత విద్యా సంవత్సరం జూనియర్ కళాశాలల్లో 36 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అధ్యాపకులు లేకుండా చదువెలా సాగుతుందని ప్రశ్నించారు. నేటికీ 474 ఇంటర్మీడియట్ కళాశాలల్లో 210 మంది ప్రిన్సిపల్స్ లేరని, 26 జిల్లాలకు పర్మినెంట్ ఆర్ఐఒలు, 13 మంది డిఇఒలు లేరని తెలిపారు. ఇంటర్మీడియట్ అడ్మినిస్ట్రేషన్ సిలబస్ ప్రణాళిక తూతూమంత్రంగా నడుస్తోందని చెప్పారు. ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేసిందని తెలిపారు. ఈ నిరసన దీక్షకు సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, కృష్ణ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మునిస్వామి మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, ఉమేష్, నాయకులు గాది, వంశీ, ప్రేమ్ కుమార్, గణేష్, తేజ, మల్లి, మధు, మల్లికార్జున, కరుణాకర్ పాల్గొన్నారు.


దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

టిడ్కో ఇళ్లలో చేరండి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

లబ్ధిదారులు సత్వరమే టిడ్కో ఇళ్లల్లో చేరితే అన్ని సదుపాయాలూ కల్పిస్తామని, లేకపోతే పరిస్థితి మొదటికే వస్తుందని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి సూచించారు. పట్టణంలోని శివారు ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అక్కడికొచ్చిన లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. తాగునీటి వసతి, విద్యుత్, రోడ్డు వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. టిడ్కో ఇళ్లపై అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. లబ్ధిదారులు త్వరగా చేరితే మరిన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. 2 వేల మందికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయిందని, వారు చేరేందుకు ముందుకు వస్తే తాళాలు అప్పగిస్తామని చెప్పారు. గృహ సముదాయం ఉండడం వల్ల కొన్ని వ్యక్తిగత సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న కాలనీలో ఇండివిజువల్ హౌసెస్ నిర్మిస్తున్నారని తెలిపారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో పేదలకు సెంటున్నర స్థలం కేటాయించామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ స్థలంలోనే టిడ్కో గృహాలు నిర్మించి కొందరు లబ్ధిదారులకు నష్టం చేకూర్చారన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైస్ ఛైర్మన్లు కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఇంతియాజ్, వసీం, నాయకులు దేవా, బికె.లక్ష్మన్న, బిటి.లక్ష్మన్న, నగరూరు చంద్రశేఖర్ రెడ్డి, రామలింగేశ్వర యాదవ్, చిన్న ఈరన్న, చంద్ర, నాగ కల్పవల్లి పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ స్కిల్ హబ్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సూచించారు. పట్టణంలోని బాలుర హాస్టల్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఎమ్మెల్సీ మధుసూదన్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... నిర్దిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణ, అంకిత భావాన్ని విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే జీవితంలో త్వరగా స్థిరపడతారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, కౌన్సిలర్లు చిన్న, రామలింగేశ్వర యాదవ్, జిల్లా డాక్టర్ల సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, మాజీ మండల అధ్యక్షులు పంపాపతి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, సురేష్ పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి


గరుసు వేసిన సభ్యులు

సామాజిక సేవలో ప్రయివేట్ విద్యాసంస్థలు

- అపుస్మా సెక్రటరీ సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి - కౌతాళం

సామాజిక సేవలో మండల ప్రయివేట్ విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుంటాయని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ (అపుస్మా) కౌతాళం కమిటీ సెక్రటరీ సయ్యద్ దూద్ బాష తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ సంఘం దృష్టికి వచ్చిందని, ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్లు అందరూ కలిసి ముందుకొచ్చినట్లు తెలిపారు. ఎంఇఒ శోభారాణి ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాల పరిసరాలలో వర్షపు నీరు ఆగి పాఠశాలకు వెళ్లడానికి దారి లేనందున గరుసు వేయించినట్లు చెప్పారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు మార్గం అనువుగా మారిందన్నారు. మండలంలో 50 నుంచి 60 శాతం రైతులు, రైతు కూలీ పిల్లలు ఉన్నారని, అలాంటి వారికి తక్కువ ఫీజులతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా క్రమశిక్షణ, నైతిక విలువలు గల విద్యను అందించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని తెలిపారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు లింగన్న, గౌస్ మోదిన్, నాగార్జున రెడ్డి, ఆంజనేయులు, సిద్ధన గౌడ్, నాగభూషణ్ గౌడ్, సురేష్ స్వామి, సిఆర్‌పి రామాంజనేయులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

- సైకియాటిస్టు డాక్టర్ చైతన్యకుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల


మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య కుమార్

మానసిక సమస్యలతో ఇబ్బందులకు గురై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆదోని ఏరియా ఆస్పత్రి సైకియాటిస్టు డాక్టర్ చైతన్యకుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామాల్లో మానసిక సమస్యలకు గురయ్యే వారిని గుర్తించడం తీసుకోవాల్సిన చర్యలపై ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలకు సైకాలజిస్ట్ డాక్టర్ సుబ్బయ్య, కౌన్సిలర్ సోషల్ వర్కర్ సోమేష్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్యకుమార్ మాట్లాడారు. విధులు నిర్వహించే వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ కుటుంబ కలహాలు, మానసిక సమస్యలతో సతమతమయ్యే వారిని గుర్తించాలని, వారిని తమ దగ్గరికి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇప్పించాలని తెలిపారు. అలాంటి సమస్యలు ఉన్న వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలి మానస కార్యక్రమంలో భాగంగా 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు అందుబాటులో ఉన్న కౌన్సెలర్‌ను గాని, సైకియాటిస్టును గాని పంపుతామన్నారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో ప్రతి సోమవారం, గురువారం నేరుగా తనను సంప్రదించి తగిన వైద్య సహాయం పొందవచ్చని తెలిపారు. డాక్టర్ రవళి, డాక్టర్ రుక్సానా, ఎంపిహెచ్‌ఈఓలు హనుమంతు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పచ్చదనమే ప్రాణవాయువు'

ప్రజాశక్తి-ఆలూరు

మానవ మనుగడకు పచ్చదనమే ప్రాణవాయువని సాయిశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎజిఎం సురేష్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆర్‌సి రంగారెడ్డి, ప్రిన్సిపల్ అర్చన, ఎఒ రామిరెడ్డి ఆధ్వర్యంలో హరిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వచ్ఛమైన వాయువు ప్రతి ప్రాణికి అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇల్లు, పాఠశాల, కార్యాలయం ఆవరణలో మొక్కలు పెంచుకోవాలని చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రత, వ్యవసాయం దాని ప్రాధాన్యతను వివరించారు. జాన్ ప్రతాప్, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీశైలానికి నిలిచిన ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి సోమవారం మూడు గంటల సమయానికి నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదన ద్వారా మధ్యాహ్నం 12 గంటల వరకు 4,776 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా మూడు గంటల సమయానికి పూర్తిగా నీటిని నిలిపివేశారు. అదే సమయానికి శ్రీశైల జలాశయం నీటిమట్టం 812 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 35.47 టిఎంసిలుగా నమోదయింది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.

ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

- ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ
- కలెక్టరేట్ ఎదుట 8 గంటల నిరాహార దీక్ష



8 గంటల నిరాహార దీక్ష చేపడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డక్క కుమార్, నిరంజన్‌లు డిమాండ్ చేశారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 3 వేల అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద 8 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందని అన్నారు. ఓ వైపు విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నామని, అభివృద్ధికి వైసిపి తప్ప ఏ పార్టీ కృషి చేయలేదని గొప్పలు మాత్రమే చెప్పుకుంటుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేమని నిసిగ్గుగా ప్రకటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయక అనేకమంది పరీక్షలలో ఫెయిల్ కావడానికి ముఖ్య కారణమని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి ప్రకటించకపోవడం వల్లే ఈరోజు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటికీ ఖాళీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయక పోవడం దారుణమన్నారు. గతంలో ఇంటర్ విద్యా ర్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని నేడు రద్దు చేయడం వల్ల కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 3 వేల అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు మధు కిరణ్, ప్రతాప్, జిల్లా నాయకులు రమేష్, సిద్ధార్థ, కార్తీక్, విద్యార్థులు అబ్దుల్ ఖాదర్, లోకేష్, చరణ్, రంగస్వామి, మద్దిలేటి, సాయి, చంద్రశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


గండి పడిన చోట తాత్కాలికంగా పూడ్చుతున్న రైతులు



శివపురం చెరువుకి గండి

- ఆందోళనలో ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని శివపురం గ్రామంలో ఉన్న చెరువుకు ఆదివారం రాత్రి గండిపడింది. దీంతో చెరువు కింద ఉన్న పొలాలు నీట మునుగుతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామంలో ఉన్న చెరువుకు భారీగా నీరు వచ్చి చేరుతోంది. గండిపడిన విషయం సంబంధిత అధికారులకు తెలిపినా చెరువు వద్దకు ఎవరూ రాలేదని రైతులు చెబుతున్నారు. చెరువు కింద ఉన్న రైతులు మాత్రం తమ పొలాలు నీట మునిగిపోతాయని అక్కడికి చేరుకుని గండి పడిన చోట తాతాలిక మరమ్మతులు చేపట్టారు. అయినా నిలబడక పోవడంతో నీరు వెళ్లిపోతుంది. మంగళవారం జెసిబితో వచ్చి గండిని పూర్తిగా పూడ్చుతామని రైతులు తెలిపారు. సుమారు మూడు సంవత్సరాల క్రితం చెరువుకు గండి పడడంతో సంబంధిత అధికారులు తూతూ మంత్రంగానే మరమ్మతులు చేపట్టడం తోనే మళ్లీ గండి పడిందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చెరువు గండికి శాశ్వతంగా మరమ్మతులు చేయాలేని, లేకపోతే చెరువు కింద ఉన్న పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం గూటిపల్లి గ్రామానికి చెందిన రైతు బాలు (46) అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రైతు బాలు గూటిపల్లి గ్రామంలో తనకున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, కంది, పొద్దు తిరుగుడు తదితర పంటలు సాగు చేశాడు. గత మూడు సంవత్సరాలుగా పంటల దిగుబడి అంతంత మాత్రంగా రావడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు మిగిలాయి. పంటల సాగు కోసం చేసిన అప్పులు రూ.8 లక్షలకు చేరుకున్నాయి. అప్పులు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అప్పులు ఎలా తీర్చాలోనని మదన పడుతూ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి


ఆత్మహత్య చేసుకున్న రైతు బాలు(46)

వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకు భార్య రాములమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న బేతంచర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్వీస్ రిక్వెస్ట్‌లు క్లియర్ చేయండి

- స్పందన ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్


ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న సురక్ష సర్వీస్ రిక్వెస్ట్‌లను వితిన్‌ఎస్‌-ఎల్‌ఎలో క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరుతో పాటు డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో ప్రజల సంతృప్తి స్థాయికి సంబంధించి గుర్తించిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించాలన్నారు. పాణ్యం, గడివేముల, శ్రీశైలం తదితర మండలాల్లో పెండింగ్ ఈకేవైసీని పూర్తి చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు పూర్తి చేయడంతో పాటు ఇంకా ప్రారంభించని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన అర్జీలను నిర్ణీత గడువులోపు అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 215 మంది అర్జీలు సమర్పించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డిపిఒ మంజుల వాణి తదితరులు ఆవిష్కరించారు.

అర్జీదారులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం

స్పందన అర్జీదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు జహంగీర్ (ఇండస్ హాస్పిటల్) సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బసిరున్నిసా బేగం, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ లక్ష్మీ దేవి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని



'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలకు

కార్యాచరణను సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అక్టోబరు 2న జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున ప్రారంభించే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సెట్కూర్ సీఈఓ, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా వరకు వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించాలన్నారు. అవసరమయితే జిల్లా స్థాయి అదికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను వివరించి అవగాహనా కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీతో పాటు ఇతర సాంప్రదాయ క్రీడలు కూడా నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెట్కూర్ సీఈఓ రమణ, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి : ఆర్‌పిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరంక్షించి పర్యావరణాన్ని కాపాడాలని నంద్యాల రైల్వే ప్రొటెక్షన్ అధికారులు తెలిపారు. గుంటూరు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదేశాల మేరకు నంద్యాల రైల్వే స్టేషన్ ప్రాంతంలో వారు సోమవారం వంద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాదు వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జి.జయరాములు, ఏఎస్ఐ డి.జనార్ధన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎంఎస్‌సి బోస్, హెడ్ కానిస్టేబుల్ దాశరథి, కానిస్టేబుల్ పిఎన్ రాజు, డబ్ల్యూసి అనఖా, సిబ్బంది పాల్గొన్నారు. **పాణ్యం :** పర్యావరనాన్ని పరిరక్షించి బావితరాలకు స్వచ్ఛమైన ప్రకతిని అందించాలని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మదు సుధన్ జెట్టి అన్నారు. ఫార్మసీ కళాశాలలో పర్యా వరణ పరిరక్షణపై ఎక్స్పో నిర్వహించారు. వివిధ రకాల పర్యావరణ అంశాలపై విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్ లను పరిశీలించి పర్యావరణం గురించి వివరించారు.




మొక్కలు నాటుతున్న ఆర్‌పిఎఫ్ అధికారులు

కేంద్రంలో మోడీ దుష్పరిపాలన

- రైతాంగాన్ని, శ్రామికులను కాపాడండి - కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి - చాగలమర్రి

కేంద్రంలోని ప్రధాని మోడీ దుష్పరిపాలన సాగిస్తున్నారని, రైతాంగాన్ని, శ్రామికులను కాపాడుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, జిల్లా నాయకులు సురేష్, ఈ.మహబూబ్ బాషా తెలిపారు. ఈ నెల 30న విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం చాగలమర్రిలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతాంగానికి, కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్ర హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, ఎలక్ట్రిసిటీ బిల్లు-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా నిర్ణయించి చట్టబద్ధత చేయాలన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న రైతాంగ ఆత్మహత్యలను అరికట్టుటకు పంట రుణాలన్నింటినీ రద్దు చేసి, కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టం పార్లమెంటులో తీసుకురావాలని కోరుతూ దేశంలోని 500 రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఆందోళన చేపడతామని తెలిపారు. అలాగే లక్షలాది కార్మికులు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశంలోని కేంద్ర ట్రేడ్ యూనియన్లు సంయుక్త వేదికనేర్పరుచుకున్నాయని తెలిపారు. ఈ రెండు కార్మిక కర్షక సంఘాల ఆధ్వర్యంలో తమ హక్కుల కోసం గతంలో ఢిల్లీలో 387 రోజులపాటు ఆందోళన



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు రామచంద్రుడు తదితరులు

చేసిన ఫలితంగా ప్రధాని మోడీ దిగివచ్చి 'తప్పయింది.. క్షమించండి.. మీ హామీ.. మీ కోరికలను తీరుస్తాను' అని లిఖితపూర్వకమైన హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. అందువల్లనే మళ్లీ ఢిల్లీ తరహా దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రంలో ఈ నెల 30న విజయవాడలో జరిగే కర్షక కార్మిక రాష్ట్ర సదస్సులో అఖిల భారత రైతు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని, భవిష్యత్ పోరాట ప్రణాళికను రూపొందిస్తారని తెలిపారు. ఈ సదస్సులో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రైతులు, కూలీలు, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని విశ్వరూపనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ డిఈఈ రవికాంత్ చౌదరి పుస్తకాలు, పెన్నులు సోమవారం పంపిణీ చేశారు. డిఈఈ రవికాంత్ చౌదరి నంద్యాల నుండి ఆళ్లగడ్డకు రెండు రోజుల క్రితమే బదిలీపై వచ్చారు. ఆయన శ్రీ నృసింహ సేవా వాహిని కర్నూలు జిల్లా అధ్యక్షులుగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ కంబగిరి, విద్యుత్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో బస్సు, కారు ఢీ

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం గాజుల పల్లి గ్రామం నుండి గిద్దలూరు వైపు వెళ్లే నల్లమల ఘాట్ రోడ్డులో సోమవారం ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళుతున్న ఆర్టీసీ బస్సు, నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్తున్న కారు శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. కార్ డ్రైవర్ జి.హాజి, మరొక వ్యక్తి అహ్మద్‌లకు గాయాలయ్యాయి. వీరిని గాజులపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన మహానంది రోడ్ సేఫ్టీ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

జగన్ పని అయిపోయింది

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పని అయిపోయిందని, వైసిపి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాన్ని నెరవేరుద్దామని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి తెలిపారు. నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన సోమవారం నంద్యాలలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసిపి చిత్తు చిత్తుగా ఓడిపోతుందని, జగన్ శంకరగిరి మాన్యాలకు పోక తప్పదని, ఈ లోపలే జైలుకు కూడా పోవచ్చని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రైతులు రగిలిపోతున్నారని, మహిళలు, మందు బాబులు మండిపోతున్నారని, ఉద్యోగులు ఉడికిపోతున్నారని, యువత ఆవేశంతో ఉన్నారని, కాంట్రాక్టర్లు కసితో ఉన్నారని, సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారన్నారని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పులు, అవినీతి, అరాచక, మద్యం, జూదం, గంజాయి, డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మారిందని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ల్యాండ్, మైన్, ఎర్రచందనం, బియ్యం మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విమర్శలు చేశారు. అదానీ వ్యవహారంలో మోడీ ప్రతిష్ట, వివేక హత్య కేసు వ్యవహారంలో జగన్ ప్రతిష్ట అధ:పాతాళానికి పడిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. సమావేశంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దిలేటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ హబీబ్ ఖాన్, జిల్లా ఎస్సీ అధ్యక్షులు నాగలింగం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సంపంగి రామకృష్ణ, జిల్లా ట్రెజరర్ ఎస్‌వైడి ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు చాబూలు సలాం, జిల్లా కార్యదర్శి రఫీ, జిల్లా కార్యదర్శి రెహ్మాన్, రియాజ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాయలసీమ వ్యతిరేకి సిఎం జగన్

బనగానపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రాయలసీమ వాసిగా ఉంటూ సీమకు తీరని ద్రోహం అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, నంద్యాల పార్లమెంటు జిల్లా కమిటీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్‌లు విమర్శించారు. బనగానపల్లె పట్టణంలోని బివి సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మీడియా సమావేశం జిల్లా కార్యదర్శి బాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో సీమకు నవమోసాలు జరిగాయని అన్నారు. రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీమకు ద్రోహం చేస్తున్న వైసిపి, ఇతర పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ కో ఆప్షన్ సభ్యులు ముజ్బూర్ రెహమాన్, అల్లా ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దిలేటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ హబీబ్ ఖాన్, జిల్లా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తులసి రెడ్డి

ఇఎన్‌టి శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - నంద్యాల

మధుమణి నర్సింగ్ హెూమ్ నిర్వాహకులు ప్రముఖ ఈఎన్‌టి వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్, డాక్టర్ నాగమణిల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 32వ ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 100 మంది కి శస్త్ర చికిత్సలు, వెయ్యి మందికి ఓపిడిలో ఉచితంగా చూశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. 50 లక్షల విలువైన వైద్య సేవలు నిరుపేదలకు అందించారు. మధుమణి చారిటబుల్ సొసైటీ సహకారంతో డాక్టర్ మధుసూధన్ రావు తల్లిదండ్రులు చిత్తలూరు వెంకట శెట్టి, పులమ్మల జ్ఞాపకార్థం ఈ శిబిరం ప్రతి ఏటా గత 31 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. సోమవారం శిబిరం ముగింపు సందర్భంగా వైద్యులు మధుసూదన రావు, మణిదీప్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మధుమణి చారిటబుల్ సొసైటీ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం ప్రతిఏటా నిరుపేదల కోసం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వైద్యులు మధుసూదనారావు, నాగమణి, మణిదీప్‌లను రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అభినందించారు. డాక్టర్ మధుసూదనరావుకు ఐఎంఏ వైద్యుల దినోత్సవ జాతీయ సేవా పురస్కారానికి ఐఎంఏ జాతీయ నాయకత్వం ఎంపిక చేసిందని తెలిపారు.



ఉచిత శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులతో వైద్యులు మధుసూదనరావు, మణిదీప్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

గడప గడపకు సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రుద్రవరం : జగనన్న పాలనలో గడపగడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఆర్.నాగులవరం సచివాలయం పరిధిలోని ఆర్.కొత్తపల్లి, టి.లింగం దిన్నె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పాటు తమను ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపిటిసి రామచంద్రారెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, యువ నాయకుడు హరి నారాయణ, బద్రి ఎర్రన్న, మహేష్, కోటకొండ సర్పంచి వెంకటేష్, వినోద్ కుమార్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, బాలేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడు స్వామికి విశేష పూజలు

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని ప్రసిద్ధ దేవాలయం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్, రమాదేవి దంపతులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి 511 లీటర్ల పాలతో అభిషేకం చేయించారు. అనంతరం వారిని ప్రధాన అర్చకులు నారాయణ స్వామి, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వార్డుల అభివృద్ధికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని వార్డులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని 11వ సచివాలయ పరిధిలో 21 వ వార్డు నందు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన నిధులతో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. 6 లక్షల రూపాయలతో సిసి డ్రైన్, కల్వర్టు నిర్మిస్తున్నామని, 10 లక్షల రూపా యలతో సిసి రోడ్డు, ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం 8 వార్డులో శానిటేషన్ పనులకు సంబంధించి పనులపై ఆరా తీశారు. ఎలక్ట్రికల్ పోల్స్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలతో నేరుగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,మున్సిపల్ ఏఈ సురేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ సాదిక్,నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నేడు విద్యాసంస్థలు బంద్ : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రతాప్ కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత యాదవ్ జెండా ఊపి ప్రారంభిచారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. జీవో నెంబర్ 77ని తీసుకొచ్చి, విద్యార్థుల ఉన్నత విద్యకు ఇబ్బంది కలగజేస్తున్నారన్నారు. ప్రస్తుతం డిగ్రీ 3 సంవత్సరాలు ఉంటే, దానిని నాలుగు సంవత్సరాలకు పెంచారని, వీటితోపాటు విద్యా రంగంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారానికై జూలై 25న రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని, విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ సూర్య సహాయ కార్యదర్శి చంద్రనాయక్, శివకేశవులు, బంగరప్ప, ధనుష్, శశిధర్ రెడ్డి, శ్రీకాంత్, వంశీ, లక్ష్మీనారాయణ, ధర్మ తేజ్, తదితరులు పాల్గొన్నారు..

దేశంలో మహిళలకు రక్షణ లేదు : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

దేశంలో మహిళలకు రక్షణ లేదని సిపిఎం నాయకులు అన్నారు. మణిపూర్‌లో దళిత మహిళలపై జరిగిన అమానియ అత్యాచారాలను నిరసి స్తూ సోమవారం నాడు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్లె కార్డ్‌లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్, మా బాషులు మాట్లాడుతూ మణిపూర్‌లో ఉన్మాదులు ఆయుధాలు ధరించి దళిత మహిళలను టార్గెట్ చేసి బట్టలిప్పమని లేదంటే చంపేస్తామని బెదిరింపులు, గ్యాంగ్ రేప్‌లకు పాల్పడుతుంటే కేంద్ర ప్రభుత్వం వాటిపై మౌనం వ్యక్తం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని పేర్కొన్నారు. వెంటనే ప్రధానమంత్రి మణిపూర్‌లో జరిగే అల్లర్లపై స్పందించి అత్యాచారానికి పాల్పడిన యువకులపై చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ సురేంద్ర,షేక్ ఇస్మాయిల్, తుమ్మలూరు శివకుమార్, గణపతి మహమ్మద్ సామేలు శేఖర్ వీరన్న పుల్లయ్య శ్రీను రాజు హుస్సేన్ సాబ్ మల్లయ్య రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మనదేశంలోని మణిపూర్ రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో మహిళల పట్ల జరుగు జరిగిన బలహీన వర్గాల పట్ల అనుచితమైన దుర్మార్గమైన మారణకాండలకు నిరసనగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. మాధవస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి నుండి పెట్రోల్ బంకు కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాధవ స్వామి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం మధుసూదన్ రావు, నాయకులు వెంకట కృష్ణుడు, ఓబులేసు, వి. సుబ్బరాయుడు, బాలాజీ నాయక్,



ఆత్మకూరులో కేజీ రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చాంద్‌పాషా, పి. సుబ్బరాయుడు, వెంకట శివయ్య, సుధాకర్, రమేష్, పోల్యా నాయక్, గోవిందు నాయక్ లెక్చరర్లు కిషోర్, వీరన్న ,వెంకటేశ్వర్ రెడ్డి , నాగేశ్వర్ రెడ్డి, రఫీ, ఖాద్రి, రమేష్ బాబు, ఆగస్టీన్, ఎల్లా సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమానికి ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాలు బాధ్యత వహించాలని కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రంగమ్మ, మహిళా సంఘం నాయకురాలు సోదా బీబీ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో రెండున్నర నెలల నుండి కుకీ తెగ (క్రిస్టియన్లు) ప్రజల ప్రాణాలపై, మానాలపై, ఆవాసాలపై, ప్రార్థన స్థలాలపై మెయితీ హింతక ముఠాలు బహిరంగంగా సాగిస్తున్న హింసకాండకు మతోన్మాద పాలకులు అండగా ఉన్నారని ఆరోపించారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం, అనాగరికమైన ఘటన 140 కోట్ల భారతీయులకు, దేశానికి తలవంపు అని ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మణిపూర్ సంఘటనను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. మణిపూర్ మారణహోమంపై సిట్ ఏర్పాటు చేసి మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్



చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామిక వాదులతో కలిసి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమై కేంద్రంలోని మతోన్మాద మోడీ మెడలు వంచి తీరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న ఏసన్న, దేవరాజు, సుంకన్న, డప్పు కళాకారుల సంఘం కురువమ్మ, ఈరన్న, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మణిపూర్ ఘటనకు బాధ్యత వహించి ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి, మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఏపి రైతు సంఘం నాయకులు టి రామచంద్రుడు డిమాండ్ చేశారు. చాగలమర్రిలో ఏపి రైతు సంఘం నాయకులు టి రామచంద్రుడు, సురేష్, ఇఎండి బాషా మాట్లా డుతూ బిజెపి పరిపాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతొందని అన్నా రు. ప్రజాస్వామ్యవాదులు మణిపూర్ ఘటనను ఖండించాలని అన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

వేతనంపై భరోసా కల్పించాలి

- జిల్లా అంబుడ్స్ మెన్ పర్సన్ డాక్టర్ ఆర్ సురేంద్ర కుమార్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామపంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పని దినాలు కల్పించి, దినసరి వేతనం గురించి భరోసా కల్పించాలని జిల్లా అంబుడ్స్ మెన్ పర్సన్ డాక్టర్ ఆర్ సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం సంత జూటూరు గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశం వద్దకు ఆయన వెళ్లి కూలీలతో మాట్లాడారు. కూలీలు పనిచేసే చోట ప్రథమ ప్రథమ చికిత్స మందులు సౌకర్యాలు కల్పించడం వేతనాలు త్వరగా వారి ఖాతాల్లో జమ అయ్యేటట్టు చూసుకోవాలని అధికారులకు కోరారు. గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతూ స్వయంగా ఆర్థికంగా అభివృద్ధి చెంది పురోగతి సాధించే విధంగా సిబ్బంది ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం మండల సమావేశం భవనం నందు ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా దారిద్ర రేఖ ఉద్యోగం ఉన్న కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా నేలతొక్కునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈపిఓలు వసుధ, నాగార్జున, బీసీ వరదరాజులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినత పిత్రం ఇస్తున్న చెంచులు

కబ్జాదారుల నుండి భూములను రక్షించండి

- తహశీల్దార్‌కు చెంచులు ఫిర్యాదు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణ శివారులో జీవనోపాదుల దగ్గర ఉన్న సర్వే నంబర్ 200/2బి చెంచులకు ప్రభుత్వం భూమిని కేటాయించిందని, ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులు సాగు చేశారని సోమవారం స్పందన కార్యక్రమంలో తాసిల్దార్ రాజశేఖర్ బాబుకు చెంచులు ఫిర్యాదు చేశారు. గతంలో అనగా రమణారావు తహశీల్దార్‌గా ఉన్నప్పుడు 2016వ సంవత్స రంలో చెంచులకు ప్రభుత్వ స్థలాలు 64 మందికి పట్టాలిచ్చి,ఒక్కొక్కరికి సెంటున్నరా స్థలం కేటాయించడం జరిగిందన్నారు. చెంచులకు ఐటిడిఏ కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి సాగు చేశారని వారు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోనే ఇంటి స్థలం లేని పేదలు ఎందరో ఉన్నారని వారిని గుర్తించి ప్రభుత్వ స్థలాన్ని పేదలకు పంపిణి చేయాలని కోరారు. స్థలం ఆక్రమిం చుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారించి న్యాయం చేస్తామని తాసిల్దార్ రాజశేఖర్ బాబు చెంచులకు హామీ ఇచ్చారు.

కలవటాల రైతులకు న్యాయం చేయండి



తాసిల్దార్ కి వినతిపత్రం ఇస్తున్న కలవటాల గ్రామస్తులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల పరిధిలోని కలవటాల గ్రామ రైతులు తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెండుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఫ్రిజ్జం సిమెంట్ పరిశ్రమ నిర్మిస్తామని 2008లో భూములు కొనుగోలు చేసి ఇంతవరకు పరిశ్రమ స్థాపించ కుండా భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి చూపడం లేదని, న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవటాల కృష్ణ రంగారెడ్డి, కామినేని భాస్కర్‌రెడ్డి, కామినేని ప్రతాపరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నారపరెడ్డి, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు చేపడుతాం : సిపిఎం



రైతులకు న్యాయం జరగకపోతే రాంకో సిమెంట్ పరిశ్రమ దగ్గర రిలే నిరాహార దీక్షలు చేపడతామని సిపిఎం మండల కార్యదర్శి పి దావీదు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండ లంలోని కోటపాడు కలవటాల గ్రామాల మధ్యన ఫ్రిజ్జం సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని రైతుల భూములు కొనుగోలు చేసి ఇంతవరకు పరిశ్రమ స్థాపించకపోగా మరో పరిశ్రమకు ఫ్రిజ్జం భూముల్లో బదిలీ చేస్తున్నారని తెలియడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. రైతులను అమాయకులను చేసి మోసం చేస్తున్న ఫ్రిజ్జం సిమెంటు పరిశ్రమ, కొలిమిగుండ్ల మండలంలోని కలవటాల గ్రామం వద్ద ఫ్రిజ్జం సిమెంటు యాజమాన్యం, రైతుల వద్ద సేకరించిన భూములు రైతులకు ఇవ్వాలి రాంకో ఫ్రిజ్జం సిమెంటు పరిశ్రమలు రెండు రైతులను ప్రజలను మోసం చేయడానికి వారి ఇష్టాచారంగా నిర్ణయాలు తీసుకు ంటున్నారన్నారు. ప్రజ్జం పరిశ్రమ భూములు అమ్మడానికి ఏ హక్కు లేదని, కొనడానికి రాంకో సిమెంట్ పరిశ్రమ ఎందుకు ముందుకు వస్తుందో అర్థం కావడం లేదన్నారు. జీవో 1985 ప్రకారము ఒక పరిశ్రమ రైతులతో భూములు కొన్న తర్వాత మూడేళ్ల లోపు పరిశ్రమ స్థాపించకపోతే ఆ భూములను రైతులకే ఇవ్వాలన్నారు.

వైసిపి నేత శంకర్ రెడ్డి మృతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని యాదవాడ మాజీ సర్పంచ్, సీనియర్ వైసిపి నాయకులు బోల్లపు శంకర్ రెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి గ్రామానికి వెళ్లి శంకర్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం శంకర్ రెడ్డి అంతిమ యాత్రలో గంగుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, మద్రిపల్లె నాయకులు పత్తి తులసీశ్వర్ రెడ్డి, గంగుల



నివాళులర్పించిన ఎమ్మెల్యే గంగుల



డాక్టర్ యమ్ తులసి రెడ్డిని సన్మానించిన మెడిక్యూర్ హాస్పిటల్ యాజమాన్యం

మెడిక్యూర్ హాస్పిటల్‌ను సందర్శించిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని నూతనంగా ప్రారంభించిన మెడిక్యూర్ హాస్పిటల్‌ను కాంగ్రెస్ నాయకులు ఎపి రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్.ఎం.తులసి రెడ్డి, నంద్యాల డీసీసీ లక్ష్మి నరసింహ యాదవ్, పిసిసి డెలిగేట్ మసూల్దర్ ఫరూక్, పఠాన్ హబిబ్ ఖాన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ తులసి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల చుట్టూ పరిసరాల ప్రజలకు అందుబాటులో మెడిక్యూర్ హాస్పిటల్ ఉందని, మంచి వైద్యం అందుతుందని పేర్కొన్నారు. హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్.సునీల్ బాబు, కార్డియాలజీ నిపుణులు డాక్టర్. హేమబిందు, మసూల్దర్ అబ్దుల్ రెహ్మాన్,పారల్ రాఘవేంద్ర లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ రఫీ, రామకృష్ణ, షరీఫ్, ఖాసిం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి రస్తా చూపించండి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు అంగన్వాడీ కేంద్రం-2కు రాస్తా చూపించాలని స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణకు సూపర్వైజర్ లలిత ప్రభా వతి అంగన్వాబా టీచర్ నాగమ్మ, శివలక్ష్మిలు వినతిపత్రాన్ని అందజేశారు. 1992లో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించారని, గతంలో అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే చెట్లు ఎక్కువగా మొలసి చిన్న పిల్లలు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్న సందర్భంలో ఎమ్మెల్యే ఆర్థర్ స్పందించి జెసిబి ద్వారా చెట్లను క్లీన్ చేయించారని తెలిపారు. ఇప్పుడు ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి అంగన్వాడీ కేంద్రానికి రస్తా లేదని అభ్యంతరం తెలుపుతున్నారని సంబంధిత అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రానికి రాస్తాను చూపించాలని వారు కోరారు. అలాగే అంగన్వాడి కేంద్రం 4 నూతనంగా భవనాన్ని నిర్మించినప్పటికీ రంగులు వేయలేదని పెండింగ్ పనులను పూర్తి చేసి సెంటర్‌ను అప్పజెప్పాలని వారు కోరారు. స్పందించిన ఎంపీడీవో పంచాయతీరాజ్ ఏఈతో విచారించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కాచింతల క్షేత్రంలో వరుణయాగం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ



వరుణ యాగం చేస్తున్న దృశ్యం

స్థానిక కాచింతల క్షేత్రం సమీపంలో సోమ వారం వరుణ యాగం నిర్వహించాఉ. ఎరువుల దుకాణాలు, క్రిమి సంహారక మందులు, విత్తన దుకాణ దారులు, రైతులు సమిష్టిగా ఈ వరుణ యాగాన్ని నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, రాష్ట్రం పాడిపంటలతో కలకలలాడాలని యాగం నిర్వహించడం జరిగిందని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ అధినేత రంగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ యాగంను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో రైతులు తరలి వచ్చారు.

కాలభైరవునికి బోనాలు : మండలంలోని చిన్న కందుకూరు సమీపంలో ఉన్న కాలభైరవ క్షేత్రంలో సోమ వారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కాలభైరవునికి బోనాలు సమర్పించారు. 14 సంవత్సరాలకు ఒకసారి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని కాలభైరవ స్వామి అర్చకులు సేకరయ్య, శివరామయ్య, ఈశ్వరయ్యలు తెలిపారు. వర్షాలు సకాలంలో కురవాలని మహిళలు భక్తిశ్రద్ధలతో కాలభైరవునికి బోనాలు సమర్పించడం జరిగిందని వారు తెలిపారు.

చెంచులకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కొత్తపల్లి



ఉచిత మొబైల్ ఎక్సరే క్యాంపు ప్రారంభిస్తున్న వైద్యులు

చెంచు గిరిజన గూడెంలో నివసిస్తున్న గిరిజనులకు స్వచ్ఛంద సంస్థ సేవలు మరువలేనివి అని వైద్యాధికారి సౌజన్య మహమ్మద్ జాబీర్ తెలిపారు. సోమవారం కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అవరణంలో శ్రీ అశ్విని హాస్పిటల్, సేవ భారతి స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఉచిత మొబైల్ ఎక్స్-రే క్యాంప్‌ను ఆత్మకూరు టిబి యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి సౌజన్య గ్రామ సర్పంచ్ బాల ఎల్లయ్య ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సేవలు చెంచులకు అనేక రకాలుగా ఉపయోగపడతాయని అన్నారు. చెంచులు ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెంచుల కోసం ప్రత్యేకంగా ఉచిత మొబైల్ ఎక్సరే క్యాంపు ఏర్పాటు చేయడం చెంచుల అదృష్టం అన్నారు. గిరిజనులను దృష్టిలో ఉంచుకొని వారికి వైద్య సేవలు అందించడం,క్షయ వ్యాధి నిర్మూలనే వారి ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అనంతరం సేవభారతి జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, కో-ఆర్డినేటర్ ఎల్లయ్య మాట్లాడుతూ చెంచుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. అవసరం ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం ప్రత్యేక వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ ఎడ్యుకేటర్ చంద్ర శేఖర్, టిబి సూపర్వైజర్లు మస్తానయ్య, రవి కుమార్, సౌజన్య, ఆరోగ్య కార్యకర్తలు సత్యం రెడ్డి,శాంతి,సామక్క, ఆర్.డి.టి.కౌన్సిలర్ మోతిలాల్,ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బాస్ కోసం రెడ్ కార్పెట్

- సర్వాంగ సుందరంగా మారిన పోలీస్ స్టేషన్ - వాయిదా పడిన ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - అవుకు



పోలీస్ స్టేషన్ ముందర రెడ్ కార్పెట్ పరిచిన దృశ్యం

అవుకు పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీస్ బాస్ తనిఖీ చేసేందుకు వస్తున్నారన్న సమాచారం మేరకు స్టేషన్ పరిసరాలను ఎస్ఐ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది రెడ్ కార్పెట్ పరిచారు. రెడ్ కార్పెట్ వేయడం పట్ల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. గత నాలుగు రోజుల నుంచి స్టేషన్‌లోని పరిసరాలను అందంగా తీర్చిదిద్దడంతో పోలీస్ స్టేషన్ కళకళలాడుతుంది. సోమవారం మధ్యాహ్నం జిల్లా ఎస్‌సి వస్తున్నారన్న సమాచారంతో మెయిన్ రోడ్డు నుండి పోలీస్ స్టేషన్ ఎంట్రెన్స్ వరకు రెడ్ కార్పెట్‌ను పరిచి సిద్ధం చేశారు. అయితే అనుకోకుండా ఎస్‌పి పర్యటన వాయిదా పడింది. ఎస్ఐ నరేంద్ర బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా ఎస్పీ అవుకు పిఎస్‌కు వస్తుండడంతో ఎన్నడూ లేని విధంగా స్టేషన్ పరిసరాలనున పూర్తిగా మార్చివేయడం పట్ల మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైసిపి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి - పాములపాడు

గత నాలుగు సంవత్సరాల వైసిపి అరాచక పాలనను ప్రజలేకి తీసుకెళ్లాలని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు టిడిపి పరిశీలకులు జి మురళి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి జయసూర్యలు అన్నారు. సోమవారం పాములపాడులో టిడిపి కార్యాలయాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను మోసం చేశారన్నారు. మహిళల తాలులు తెగిపోతున్నాయని, మద్యపానాన్ని నిషేధం చేస్తానని నకిలీ మద్యాన్ని అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం మారుతు న్నారన్నారు. ఎన్నికల ముందు ప్రజల కష్టాలు నేను విన్నానని చెప్పి జగన్ ఏం చేశారని అన్నారు. నందికొట్కూరు తాలూ కాలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, పుష్కరాలు సమ యంలో రోడ్లు వివిధ అభివృద్ధి పనులన్నీ టిడిపి హయా ంలోనే జరిగాయన్నారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండల టిడిపి కన్వీనర్ వెంకటేశ్వర్లు, పగిడ్యాల మండల టిడిపి కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, టిడిపి మండల నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, బి వెంకటేశ్వరరావు, గోవిందు,



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్

మధు, కృష్ణ, చంద్రశేఖర్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు బషీర్ అహ్మద్, అబ్దుల్, ఆఫీస్ సురేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత మండల కన్వీనర్లు కొనసాగింపు: టిడిపి మండల కన్వీనర్‌గా హరినాథ్ రెడ్డినే కొనసాగిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ తెలి పారు. అధిష్టానం నిర్ణయం ప్రకారం పాతవారి కొనసాగుతారని పైనుండి ఆదేశాలు వచ్చాక మార్పులు జరుగుతాయని వారు తెలిపారు.

అహోబిలంలో 26 నుండి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిల క్షేత్రంలో ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తు న్నట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలా చార్యులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అహోబిలం 46వ పీఠాధిపతి స్వామి ఆశీస్సులతో సేలం తమిళనాడుకు చెందిన శ్రీ భక్త వర ప్రసాద ఆంజనేయ స్వామి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దిగువ అహోబిలంలోని టీటీడీ కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. అహోబిలం, ఆళ్లగడ్డ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఘనంగా కౌన్సిలర్ రవూఫ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వీరాభిమాని,17వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ రవూఫ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ రావు మాట్లాడుతూ అభిమానులు ఆత్మీయులు స్నేహితుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రత్యక్షంగా సోషల్ మీడియా ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి రవూఫ్ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో వైసిపి వార్డు ఇంచార్జ్ ఉస్మాన్ బేగ్,నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్,కో ఆప్షన్ సభ్యులు



కేక్ తినిపిస్తున్న దాసి సుధాకర్ రెడ్డి

శ్రీనివాస్ రెడ్డి,వైసీపీ నాయకులు రజిని కుమార్ రెడ్డి,పాతకోట రమేష్,సిపిఐ నాయకులు రమేష్ బాబు,మద్దూరు స్వామన్న,కిషోర్ కుమార్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

'సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఉత్తమం'

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలోని సమాజ సేవ కోసం నిలకలపబడిన లైన్స్ క్లబ్ సమాజానికి చేస్తున్న సేవలు ఉత్తమైనవని గౌరు హుస్సేన్ రెడ్డి, వద్దు అకాడమీ రాష్ట్ర నాయకుడు మూర్తుజావలి అన్నారు. బేతంచర్ల మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫీసులో జరిగిన సమావేశంలో వైసిపి నాయకుడు మూర్తు జవలి, ప్రముఖ పారిశ్రామికవేత్త హుసేన్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ లయన్ బి. శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మన వంతు అనాథలకు, పేదలకు సేవా కార్యక్ర మాలు చేస్తూ పర్యావరణ పరిరక్షణ కు పెద్దపీట వేయలని లయన్స్ క్లబ్ సభ్యులకు సూచించారు.

అనం తరం లైన్స్ క్లబ్ నూతన కమిటీని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 2023-2024 సంవత్సరం గాను నూతన ఆదక్షకార్యదర్శిగా కలికి వెంకట సతీష్ కుమార్, మాచిరాజు రాఘవేంద్ర రాజు కోశాధికారిగా కమతం మనోహర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబుల్ రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ ఎంజెఎఫ్ లయన్ చంద్రశేఖర్, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా గోపాల్,లయన్స్ క్లబ్ వ్యస్థాపక అధ్యక్షడు మురళీకృష్ణ, క్లబ్ డైరెక్టర్ ఉపేంద్ర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలి

- వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఈ ఏడాది మిరపను సాగు చేసే రైతులు అనేక జాగ్రత్తలు తీసుకో వాలని శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం మండలంలోని మిరప సాగుచేసిన రైతులతో కలిసి పంటల పాటించవలసిన చర్యల గురించి వివరించారు. ఈ సంవత్సరంలో వాతావరణం అనుకులాంగా లేదని రైతులు పంట నష్టపోకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు, కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదినారాయణ, పశువిజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి, ఏఈఓ రాజు, హార్టికల్చర్ అసిస్టెంట్ నాగ పనింద్ర కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

